సాక్షి ఒడిశా

బుధవారం । 2 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం

నగదు : రూ. 1,89,283

బంగారం : 1 గ్రాము

వెండి : 14 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



భగ్గుమన్న అధికార వర్గం

జీఎంసీ కమిషనర్‌పై దాడిపై అధికారులు భగ్గుమన్నారు. సామూహిక సెలవులకు వెళ్తామన్నారు.

- 8లో..



భారీ వర్షాలు..

రాష్ట్రవ్యాప్తంగా భారీ వానలు పడుతున్నాయి. నదులు పొంగి ప్రవహిస్తున్నాయి.

- 8లో..

న్యూస్‌రీల్

మంత్రి పరామర్శ



తొక్కిసలాటలో మృతుని కుటుంబీకుల్ని పరామర్శించిన విపత్తు నిర్వహణ విభాగం మంత్రి

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని రథయాత్రలో పూరీ శారదా బాలి ప్రాంతం తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుడు ప్రేమకాంత్ మహంతి కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఏడాదిగా కార్మికుల ఆందోళన



పేపరు మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కొరాపుట్/జయపురం: జయపూర్‌లోని సేవా పేపర్ మిల్లు కార్మికులు చేపడుతున్న ఆందోళనకు ఏడాది పూర్తయ్యింది. దీంతో గగనాపూర్‌లో మిల్ ప్రధాన ద్వారం ముందు భారీ వర్షంలో మంగళవారం కార్మికులు నిరసన తెలిపారు. 2024 జులై 1వ తేదీ నుంచి ఆందోళన చేపడుతున్నట్లు కార్మిక నాయకుడు ప్రమోద్ మహంతి ప్రకటించాడు. అయినా ఇంతవరకు 2018 నుంచి రావాల్సిన వేతన బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా మూసి ఉన్న పరిశ్రమని నమ్ముకొని ఉన్న కార్మికుల దుస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. ఈ పరిశ్రమని ఎవరు అమ్ముతున్నారో ఎవరు కొంటున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో నాలుగు సార్లు పరిశ్రమ అమ్మకానికి గురైందన్నారు. పరిశ్రమ నడపడానికి వివిధ సమయాల్లో రూ.250 కోట్లు తీసుకున్నారు గానీ, కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా మంది కార్మికుల చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు



అరెస్టైన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

జయపురం: చట్ట వ్యతిరేకంగా నాటుసారాను అమ్మేందుకు తీసుకెళ్తున్న ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసినట్లు జయపురం ఎక్సైజ్ అధికారి బలరాం దాస్ తెలిపారు. అరెస్టైనవారిలో జయపురం సమితి నీలాగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ నాయిక్, సునాధర కమరలు ఉన్నారు. లక్ష్మణ్ వద్ద ఒక మోటారు బైక్‌ను కూడా స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరచామని, కోర్టు బెయిల్ మంజూరు చేయకపోవడంతో జైలుకు తరలించామన్నారు.

కూల్చివేతలు సరికాదు

- వందేళ్లుగా జొరిగాంలో నివాసముంటున్నాం
- కలెక్టర్‌కు వందలాది మంది ప్రజల విజ్ఞప్తి



నబరంగ్‌పూర్ కలెక్టరేట్ వద్ద జొరిగాం ప్రజలు

కొరాపుట్: వందేళ్ల నుంచి తాము నివసిస్తున్న గ్రామంలో పట్టాలేని నివాసాలను కూల్చివేస్తామని అధికారులు ప్రకటించడం సరికాదని నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి కేంద్రం ప్రజలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చి కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రోకు వినతి పత్రం అందజేశారు. ఇలా కూలుస్తూపోతే గ్రామంలో ఏ ఒక్క నివాసం కూడా ఉండదని పేర్కొన్నారు. తమకు ఇన్నేళ్లలో ఏనాడు అధికారులు నోటీసులు ఇవ్వడం గానీ, రావడం గానీ జరగలేదన్నారు. ఇప్పుడు హఠాత్తుగా చర్యలు చేపడతామంటున్నారని గిరిజనులు పేర్కొన్నారు. ఇదే సమయంలో గిరిజనులను తోడ్కొని వచ్చిన మాజీ ఎంపీ రమేష్ మజ్జి మాట్లాడుతూ ఇలా కూలుస్తూపోతే అనేక గ్రామాలు శ్మశానాల్లా మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా అక్కడి అటవీ ప్రాంతాన్ని నమ్ముకొని జీవిస్తున్నారని, ఈ విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి మాట్లాడుతూ ఇలాంటి సమస్య జొరిగాంతో పాటు ఉమ్మర్‌కోట్, రాయిఘర్ సమితుల్లో



వేదిక మీద కలెక్టర్ శుభంకర్, మాజీ ఎంపీలు రమేష్, ప్రదీప్, ఎంపీ ప్రతినిధి పింటూ తదితరులు

ఉందన్నారు. అడవిని నమ్ముకొని గిరిజనులు జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూముల కోసమే గతంలో రాయిఘర్‌లో దళిత్ సమాజ్ ఏర్పడి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అటవీ ప్రాంతంలో గిరిజనుల నివాసాలు కూల్చితే సమస్య ఇంకా పెరుగుతుంది కానీ పరిష్కారమవ్వదని పేర్కొన్నారు.



ర్యాలీ వస్తున్న గిరిజనులు

ఇదీ ప్రజా సమస్య

బీజేపీకి చెందిన ఎంపీ ప్రతినిధి చంద్రభాను పింటూ మాట్లాడుతూ ప్రస్తుతం తాము పార్టీలకు అతీతంగా అన్నీ పార్టీల నుంచి వచ్చామన్నారు. ఇది ప్రజా సమస్య అని గుర్తు చేశారు. దీంతో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో మాట్లాడుతూ ఈ సమస్యకి పరిష్కారం దొరుకుతుందన్నారు. సమస్య తీవ్రత దృష్ట్యా దీనిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఇప్పటికే పెట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం చేస్తుందన్నారు. అయితే ప్రజలు ఏఏ స్థలాల్లో ఎంతెంత కాలం ఉంటున్నారో సర్వే చేస్తామన్నారు. అలాగే ప్రస్తుతం వారి ఆధీనంలో ఉన్నంత స్థలంలో ఉండడానికి ప్రభుత్వం అంగీకరించదన్నారు. కానీ వారికి అన్యాయం జరగదని పేర్కొన్నారు. కూలవేతలు తాత్కాలికంగా ఆపుతామని ఇంతలో ప్రభుత్వ నిర్ణయం మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షంలో సుమారు వంద కిలోమీటర్ల దూరం నుంచి వందల సంఖ్యలో ప్రజలు రావడంతో కలెక్టర్ వారందినీ కలెక్టరేట్ లోనికి పిలిపించుకొని సమావేశం నిర్వహించారు.

ముఖ్యమంత్రిని కలిసిన పాత్రికేయ ప్రతినిధులు



ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించిన పాత్రికేయ ప్రతినిధులు

భువనేశ్వర్: ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ మీడియా ప్రతినిధులు లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కలిశారు. ఈ సందర్భంగా రథ యాత్ర సమయంలో తాము ఎదుర్కొన్న వివిధ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ భువనేశ్వరులో గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులను ప్రతి సంవత్సరం పూరీకి తీసుకెళ్లి రథ యాత్రను కవరు ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది యాత్ర కవరేజి కార్యకలాపాల్లో మీడియా ప్రతినిధులు పూరీలో వివిధ సమస్యలను ఎదుర్కొన్నారని ఈ బృందం ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించింది. ఈ విషయంపై చర్చించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మీడియా ప్రతినిధులకు తెలిపారు. ఈ చర్చలో సీనియర్ పాత్రికేయులు సనత్ మిశ్రా, ప్రద్యుమ్న కుమార్ మహంతి, భగవత్ త్రిపాఠి, పవిత్ర మోహన్ సామంతరాయ్, పార్థ సారథి జెనా, కిషోర్ మంగరాజ్, దేబకాంత్ మహపాత్రో, స్వరూప్ కుమార్ మహంతి, గజేంద్రనాథ్ బెహెరా, సనాతన్ దొలాబెహెరా, సుబోధ్ కనుంగో, సూర్య కాంతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి నీలిగూడ పంచాయతీ ధర్మపల్లి గ్రామంలో కాళి మడ్కమి (38) అనే మహిళ పురుగుల మందు తాగి దుర్మరణం పాలైంది. వివరాల్లోకి వెళ్తే.. కాళి గత కొన్ని నెలలుగా మానసిక స్థిరత్వం కోల్పోయి గ్రామంలో తిరుగుతోంది. పొలం కోసం తెచ్చిన పురుగుల మందును ఇంటి వద్ద ఒకచోట కుటుంబ సభ్యులు దాచారు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ మందును తాగిపడిపోయింది. అనంతరం గమనించి కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ధర్మాపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేశారు. దీంతో వెంటనే మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ కాళి మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోడియా ఏఎస్ఐ కేశవబత్రా మల్కన్‌గిరి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద కాళి మృతదేహం

గర్భిణికి ప్రసవ కష్టాలు!

- బురద రోడ్డులో నడిచి ఆస్పత్రికి వెళ్లిన వైనం



బురదలో నడుచుకుంటూ వెళ్తున్న గర్భిణి గోరి కండకి

జయపురం: నిండు గర్భిణికి ప్రసవ కష్టాలు వెంటాడాయి. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో అంబులెన్స్ గ్రామం వరకూ రాలేని పరిస్థితి నెలకుంది. దీంతో బురదలోనే కిలోమీటర్ నడుచుకుంటూ.. అక్కడ నుంచి ఆస్పత్రికి చేరుకుంది. వివరాల్లోకి వెళితే.. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మఠపడ పంచాయితీ డెంగాపకన గ్రామానికి చెందిన పవిత్ర కండకిభార్య గోరి కండకి నిండు గర్భిణి. ఆమెకు మంగళవారం ఉదయం పురిటి నొప్పులు మొదలు కావటంతో ఆమె భర్త అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ గ్రామానికి బయలుదేరినప్పటికీ రోడ్డు బురదతో ఉండడంతో ముందుకు కదల్లేదు. గర్భిణి గోరి నొప్పులు తాళలేక పోవటంతో గత్యంతరం లేక ఆమెను పట్టుకొని బురద మార్గంలో దాదాపు కిలో మీటర్ దూరంలో నిలిచి ఉన్న అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే పండంటి మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అదృష్టవశాత్తు ఆస్పత్రికి చేరిన తరువాత ప్రసవించిందని.. ఒక వేళ మార్గంలో ప్రసవిస్తే పరిస్థితి ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి పక్కా రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.

శ్రావణ మాస భోల్ భం ఏర్పాట్లు పరిశీలన



గుప్తేశ్వరంలో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్, సబ్ కలెక్టర్ సస్యరెడ్డి

- గుప్తేశ్వరం క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్

కొరాపుట్: శ్రావణ మాసంలో వేలాది మంది భక్తులు భోల్ భం యాత్రకు తరలి రానున్న నేపథ్యంలో అందుకుతగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రావణ మాసంలోని ప్రతి సోమవారం సుమారు 30 వేల మంది భక్తులు కాలి నడకన భోల్‌భం యాత్ర చేస్తూ గుప్తేశ్వరం చేరుకుంటారు. ఈ నేపథ్యంలో సహజ సిద్ధ పుణ్య క్షేత్రం గుప్తేశ్వరం క్షేత్రాన్ని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. బోయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీలోని దండకారణ్యంలో ఉన్న ఈ క్షేత్రానికి తరలి వెళ్లారు. అక్కడ కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మితమవుతున్న ఆర్డీ విభాగ రహదారులు, నడక మార్గాలు, కాటేజీలు, భవనాలు పరిశీలించారు. శబరి నది వద్ద భక్తులకు అందాల్సిన సదుపాయాలపై ఆరా తీశారు. ముందస్తు సమాచారం లేకుండానే భారీ వర్షంలో కలెక్టర్ రావడం అధికారులకు ముచ్చెమటలు పట్టించింది. స్వయంగా గొడుగు వేసుకొని అరణ్య ప్రాంత నిర్మాణాల పురోగతిని కలెక్టర్ తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్య రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.



భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

• గుండిచా మందిరం మెరిసేలా..



గుండిచా మందిర ఆవరణను శుభ్ర పరుస్తున్న కమిటీ సభ్యులు

- అభినందనలు అందుకుంటున్న శ్రీరామ మందిర కమిటీ సభ్యులు

జయపురం: జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతా మూర్తులు రథయాత్ర సందర్భంగా జయపురంలోని గుండిచా మందిరం (బంకమఠం)లో విడిది చేసి ఉన్న దేవతా మూర్తులను తిలకించి పూజలు చేసేందుకు వేలాది మంది భక్తులు వస్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం లోపించకుండా గుండిచా మందిర ప్రాగణాన్ని జమాల్ లైన్ శ్రీరామ కమిటీ అధ్యక్షులు గోరపల్లి నాగరాజు నేతృత్వంలో మందిర పరిసరాలను కమిటీ సభ్యులు, గుండిచా మందిరాన్ని తుడిచి, కడిగి పరిశుభ్ర పరుస్తున్నారు. రథాయాత్ర సమయంలో జమాల్ లైన్ శ్రీరామ మందిర పరిశీలన కమిటీ సభ్యులు గుండిచా మందిరం ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్నట్టు నాగరాజు వెల్లడించారు. ఆదివారం నుంచి రోజూ ఉదయం ఆరు గంటలకు శ్రీరామ మందిర పరిశీలన కమిటీ సభ్యులు వచ్చి గుండిచా మందిర పరిసరాలన చీపుర్లతో తుడుస్తూ వ్యర్థ పదార్థాలను తొలగించి వాటిని పారవేసున్నట్లు వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీ వరకు సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కాగా శ్రీరామ మందిర కమిటీ సభ్యులు చేస్తున్న సేవలను భక్తులు ప్రశంసిస్తూ అభినందిస్తున్నారు. పనులను పూజారి గన్నవరపు కోటేశ్వరశర్మ పర్యవేక్షిస్తున్నారు.

కాలువలో మునిగి ఇద్దరు మృతి



కెనాల్ ఒడ్డున శుక్రి మృతదేహం



లవ్‌దేరా మృతదేహాన్ని బయటకు తెస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి నిలిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు కాలువలో మునిగి మృతి చెందారు. నిలిగూడ గ్రామానికి చెందిన లవ్ డేరా(40), శుక్ర ఫటకా(35) సోమవారం ఉదయం పొలం పని కోసం కాలువ దాటి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తున్న సమయంలో కాలువ దాటుతూ నీటిలో మునిగిపోయారు. చీకటి పడినా వారు ఇళ్లకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మంగళవారం మధ్యాహ్నం ఓ మృతదేహం కాలువలో కనిపించడంతో రైతులు మత్తిలి పోలీసులకు సమాచారం అందజేశారు. మత్తిలి ఐఐసి దేవి ప్రియదర్శిని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి కాలువలో వెతికించగా మొదట మహిళ మృతదేహం దొరికింది. మరికొంత దూరంలో రాళ్ల మధ్యన పురుషుడి మృతదేహం కనిపించింది. మృతదేహాలను మత్తిలి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పోలీసులు ప్రమాదకర మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

కుంభిగుడ, టికిరపడలో ఏనుగుల బీభత్సం



ఇళ్లను నేలమట్టం చేసిన దృశ్యం



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి చెట్లు

రాయగడ: రాయగడకు సమీపంలో గల కుంభిగుడ, కల్యాణసింగుపూర్ సమితి పరిధిలోని టికిరపడ గ్రామాల్లో ఏనుగులు బీభత్సాన్ని సృష్టించాయి. కుంభిగుడలో గల రైతు దూడల శ్రీనివాస్ ఫార్మ్‌హౌస్‌లో ఉన్న నీటి సరఫరా పరికరాలు పీకి పారేశాయి. అదేవిధంగా పక్కనే గల అరటి చెట్లను నేలమట్టం చేశాయి. టికిరపడలో కొండ ప్రాంతంలో నివసిస్తున్న కేశవ కృషిక, జుమూర్ కుట్రుకలకు చెందిన రెండు ఇళ్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ప్రాణభయంతో రెండు కుటుంబాలకు చెందిన 8 మంది అడవుల గుండా పరుగులు తీశారు. ఇళ్లలోకి చొరబడిన ఏనుగుల గుంపు ఇంటిలో దాచి ఉంచిన బియ్యం, చోలు, జొన్నలు, కందులు తదితర వస్తువులను చెల్లాచెదురు చేశాయి. మంగళవారం రాత్రి దాదాపు 24 ఏనుగులు ఒక్కసారిగా తమ ఇళ్లపై దాడి చేసినట్లు కేశవ తెలియజేశారు. గత కొద్ది రోజులుగా కళ్యాణ సింగుపూర్, కొలనార, రాయగడ తదితర సమితుల్లో ఏనుగుల సంచారం ఎక్కువవుతుండటంతో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బితుకుబితుకుమంటూ జీవిస్తున్నారు.



నీటిసరఫరా పరికరాలను ధ్వంసం చేసిన దృశ్యం



ఏనుగుల అడుగులను గుర్తించిన అధికారులు

కొరాపుట్–రాయగడ మధ్య నిలిచిన రాకపోకలు

కొరాపుట్: కొరాపుట్–రాయగడ జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు బంగ్లాగుడ వద్ద 309 జాతీయ రహదారిపై వరద నీరు పోటెత్తింది. దీంతో వాహనాలు నిలిచి పోయాయి. మూడేళ్ల క్రితం ఇక్కడ వంతెన కూలిపోయింది. దాంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. ప్రధాన వంతెన నిర్మాణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వరద నీరు రావడంతో మరలా సమస్య ప్రారంభమైంది.



రహదారిపై పోటెత్తిన వరద నీరు



వరద నీటిలో ప్రమాదకర స్థితిలో వస్తున్న పాదచారులు

క్లుప్తంగా

అలరించిన భక్తి గీతాలాపన



భక్తి గీతాలు పాడుతున్న కళ్యాణి

రాయగడ: స్థానిక న్యూకాలనీ శ్రీరామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్న రథయాత్రలో భాగంగా ఆలయ మండపంలో మంగళవారం అన్నమాచార్య సంకీర్తన మండలి వారు నిర్వహించిన భక్తి గీతాలపన కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో పి.కళ్యాణి, లాడి జయలక్ష్మి, కొత్తకోట శాంతి ప్రియ, గిరీష్ పట్నాయక్ తదితరులు అన్నమాచార్య కీర్తనలు, భక్తి గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.

తెలుగు మహిళల విష్ణు సహస్ర పారాయణం



విష్ణు సహస్ర పారాయణం చేసిన జ్యోతిర్మయి సంస్థ మహిళలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు మహిళలు విష్ణు సహస్ర పారాయణం చేశారు. మంగళవారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డు లో ఉన్న గుండిచా మందిరంలో పవిత్ర హిరా పంచమి సందర్భంగా సహస్ర పారాయణం పఠించారు. పట్టణానికి చెందిన తెలుగు ప్రజల ఆధ్యాత్మిక సంస్థ జ్యోతిర్మయి సంస్థ మహిళ సభ్యులు పారాయణం చేశారు. ఏటా హిరా పంచమి రోజున జ్యోతిర్మయి మహిళలు రథాయత్రలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 14న స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరు కానున్నారు. మర్నాడు 15న కటక్ నగరంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. కటక్‌లోని రెవెన్షా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సందర్భంగా రెవెన్షా బాలికల పాఠశాలకు శంకుస్థాపన చేస్తారు.

బీఎంసీ అధికారిపై దాడి: నాలుగో నిందితుడు అరెస్టు

భువనేశ్వర్:

స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) అదనపు కమిషనర్ రత్నాకర్ సాహుపై ఇటీవల జరిగిన దాడికి సంబంధించి నాలుగో నిందితునిగా ధ్రువీకరించి సచికాంత్ స్వయిని మంగళ వారం అరెస్టు చేశారు. ఇంతకు ముందు ఈ సంఘటనలో ముగ్గురు నిందితులను జీవన్ రౌత్, రష్మి మహాపాత్ర మరియు దేబాషిష్ ప్రధాన్‌ను స్థానిక ఖారవేళ నగర్ ఠాణా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బాధిత అధికారి ఠాణాలో పోలీసులకు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగిపై తీవ్రమైన దాడి, నేరపూరిత కుట్ర, కిడ్నాప్ యత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం, ఉద్దేశ్యపూర్వక చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడడం నేరారోపణల కింద కేసులు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. భువనేశ్వర్ మునిసిపల్ కార్పొరేషను అధికారిపై దాడికి సంబంధించి దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు కార్యకర్తల వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ చర్యలు చేపట్టింది. స్థానిక కార్పొరేటర్‌తో సహా ఐదుగురు సభ్యులను సస్పెండ్ చేసింది. హింసాత్మక చర్యలకు పాల్పడడం దుష్ప్రవర్తనగా పేర్కొంటూ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమల్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ సస్పెండు చేసిన వారిలో కార్పొరేటర్ అపురూప్ నారాయణ్ రౌత్, రష్మి రంజన్ మహా పాత్రో, దేబాషిష్ ప్రధాన్, సచికాంత్ స్వయి, సంజీవ్ మిశ్రా ఉన్నారు. వీరందరి పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు.

భగ్గుమన్న అధికార వర్గం

- ముఖ్యమంత్రితో ముఖాముఖి భేటీ
- సామూహిక సెలవు హెచ్చరిక



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసిన ఓఏఎస్ఏ ప్రతినిధులు



చీఫ్ సెక్రటరి, డీజీపీతో ఓఏఎస్ఏ ప్రతినిధుల చర్చలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పరిస్థితి అట్టుడికిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల మధ్య దూరం పెరుగుతోంది. భువనేశ్వర్ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉండగా దాడి చేయడంపై ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు (ఓఏఎస్) వర్గం తీవ్రంగా మండిపడుతుంది. ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టకుంటే సామూహిక సెలవు ఆందోళనకు దిగుతామని ముఖ్యమంత్రికి స్పష్టంగా చెప్పింది. ప్రజల పట్ల, ప్రజా ప్రతినిధుల పట్ల అధికారులు దురుసు, అసభ్య ప్రవర్తనపై ఏమాత్రం సహించేది లేదని, తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ పరిస్థితి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖపై విపరీత ప్రభావం చూపుతుంది. జాజ్‌పూర్ ప్రాంతంలో ఊహాతీత అతిసార తాండవం, పూరీలో కనీవినీ ఎరుగని రీతిలో తొక్కిసలాట మరణాలు, బలభద్ర స్వామి మూల విరాట్ బోర్లా పడడం వంటి తీవ్ర సంచలనాత్మక సంఘటనల నుంచి కోలుకోక ముందే విధి నిర్వహణలో ఉన్న భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌పై రాష్ట్ర బీజేపీ నాయకులు సోమవారం బాహాటంగా దాడి చేశారు. ఈ చర్యపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది.



ముఖ్యమంత్రితో ఓఏఎస్ఏ ప్రతినిధుల సమావేశం

ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు అసోసియేషన్ (ఓఏఎస్ఏ) ప్రతినిధులు రాత్రికి రాత్రి ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్, జంట నగరాల పోలీసు కమిషనరుతో అత్యవసరంగా సమావేశమయ్యారు. జరిగిన సంఘటనపై తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తక్షణ స్పందన ఆశిస్తున్నట్లు విన్నవించారు. తమ విన్నపంపై సత్వర చర్యలు చేపట్టకుంటే సామూహిక సెలవుతో అంతా కలిసికట్టుగా శాంతియుత ఆందోళనకు శంఖారావం చేస్తామని సున్నితంగా హెచ్చరించారు.

ముఖ్యమంత్రి బుజ్జగింపు

బాధిత అధికారుల వర్గం అభ్యర్థనపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్పందించారు. నిందితులందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 3 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇతరుల కోసం గాలింపు కొనసాగుతోందని అన్నారు. చట్టం పట్ల గౌరవ భావంతో ప్రభుత్వ చట్టపరమైన చర్యలను విశ్వసించి సామూహిక సెలవులపై వెళ్లవద్దని ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తికి బాధిత వర్గం పాక్షికంగా శాంతించింది. అయితే రాజీ కుదరలేదని ఆ వర్గం ముఖ్యమంత్రికి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఓఏఎస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు సామూహిక సెలవు ఆందోళనని వాయిదా వేశారు. మరో వైపు అన్ని జిల్లా ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అసోసియేషన్లు (ఓఏఎస్ఏ) మంగళవారం సమావేశమై, సంఘటనను ఖండించి, రాష్ట్ర సంఘానికి తీర్మానాలను పంపాలని అభ్యర్థించారు. ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అసోసియేషన్ చర్యల పట్ల ఐఏఎస్, ఓఎఫ్ఎస్, ఓఎస్ఎస్, ఓఆర్ఎస్ ఇతర సంఘాల సంఘీభావం ప్రకటించాయి.

దళిత యువకులను హింసించిన వారిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘాల ప్రతినిధులు

పర్లాకిమిడి: గంజాం జిల్లా ధరాకోట్ గ్రామంలో ఇద్దరు దళిత యువకులు గోవులను తరలిస్తున్నారని ఆరోపిస్తూ వారికి అరగుండు కొట్టి, రోడ్డుపై కూర్చోబెట్టి హింసించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని అఖిల భారత ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి బైఠాయించారు. దళిత క్రిస్టియన్లపై భజరంగ్ దళ్ నాయకులు పాశవిక చిత్రహింసలు చేసిన వారిని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ మఝి అరెస్టు చేయాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని గజపతి జిల్లా ఆదివాసీ దళిత మంచ్ కన్వీనరు కేదార్ శోబోరో హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆందోళనలో అమోద్ బర్దన్, శ్రీనివాస బెహారా, కదుకా శబర, చంద్రా శోబోరో, దళిత మహాసభ నాయకులు చైతన్య లిమ్మా పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు

పర్లాకిమిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టనున్న హర్తాల్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శ్రామిక వర్గం, వ్యవసాయ, యువజన, విద్యార్థి సంఘాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్నట్టు చెప్పారు. దీనికి నిరసనగా రాష్ట్రంలో చేపట్టనున్నసమ్మెకు అన్ని ట్రేడ్ యూనియన్లు, గజపతి మోటారు వర్కర్సు కర్మచారి సంఘాలు, ఆశ, అంగన్‌వాడీ, మిషన్ శక్తి సాథీలు, జీవికా మిషన్‌లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్లకిమిడిలోని దండుమాలవీధిలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ట్రేడ్ యూనియన్ల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఇందులో గజపతి జిల్లా మోటారు కర్మచారి సంఘం, ఆశవర్కర్లు, ఉద్యానవనాల సాథీలు, పాచికా సహాయకులు, గ్రామపంచాయతీ ఉద్యోగులతో సహా మిషన్ శక్తి, జీవికా మిషన్ అధ్యక్షురాలు సస్మితా బోడోరయితో, జిల్లా కోఆర్డినేటరు నర్సింహా మాలబిశోయి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ల సంపాదకులు జయంత్ దాస్ పాల్గొన్నారు.

యాత్ర పనులు సమీక్షించిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్ర అంతిమ ఘట్టం చేరువ అవుతుంది. తొలి ఘట్టంలో చేదు అనుభవాలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. త్వరలో శ్రీ గుండిచా మందిరంలో సంధ్యా దర్శనం, మారు రథ యాత్ర (బహుడా), స్వర్ణాలంకార దర్శనం, ఒఢొరొ పాణా, నీలాద్రి విజే వంటి ప్రముఖ ఉత్సవాలు జరగనున్నాయి. శ్రీ జగన్నాథుని రథ యాత్రలో ఇవి అత్యంత ప్రముఖమైన ఘట్టాలు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో సేవల్లో జాప్యం, తొక్కిసలాట వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర యంత్రాంగం సమన్వయంతో జాగ్రత్త వహించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పనులకు సంబంధించి మంగళవారం పూరీ సర్క్యూట్ హౌసులో ముఖ్యమంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల శారదా బాలి ప్రాంగణంలో జరిగిన తొక్కిసలాట మరణాలపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, శ్రీమందిర్ ముఖ్య నిర్వాహకుడు (సీఏఓ), రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్, అగ్నిమాపక సేవల డైరెక్టరు జనరల్ పాల్గొన్నారు.



పూరీ సర్క్యూట్ హౌస్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం

‘రాష్ట్రంలో భద్రత క్షీణిస్తోంది’

భువనేశ్వర్: రాష్ట్రంలో సాధారణ పౌరుడు మొదలుకొని ఉన్నత స్థాయి అధికారుల వరకు ఏ ఒక్కరికి భద్రత లేకుండా పోయింది. రాష్ట్రలో భద్రత, రక్షణ పూర్తిగా క్షీణించి పోయిందని పలు వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



సులోచన దాస్



సోఫియా ఫిరదౌసి



జగన్నాథ్ ప్రధాన్



బిజయ్ కుమార్ పట్నాయక్

గందరగోళ పరిస్థితి

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి గందరగోళంగా తయారైందని, విధి నిర్వహణలో ఉన్న స్థానిక నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌పై పట్టపగలు బాహాటంగా మారణాంతక దాడికి పాల్పడడం ఈ విచారకర పరిస్థితిని తేటతెల్లం చేసిందని నగర మేయర్ సులోచనా దాస్ ఘాటుగా స్పందించారు. నామ మాత్రంగా ముగ్గురు నిందితుల్ని మాత్రమే అరెస్టు చేశారని, ప్రధాన సూత్రధారి ముసుగు తొలగించి తెర పైకి తేవాలని ఆమె కోరారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన: సోఫియా ఫిరదౌసి

రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని కటక్ నియోజక వర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిరదౌసి వ్యాఖ్యానించారు. పూరీ రథ యాత్ర తొక్కిసలాట సంఘటన, బీఎంసీ సంఘటన మాత్రమే కాదు, రాష్ట్రంలో సాధారణ శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా దిగజారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అధికారి అసభ్యంగా ప్రవర్తించారు: జగన్నాథ్ ప్రధాన్

భువనేశ్వర్ నగర పాలక సంస్థ దాడి సంఘటనపై భారతీయ జనతా పార్టీ నాయకుడు జగన్నాథ్ ప్రధాన్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రత్నాకర్ సాహు తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపించారు. స్వచ్ఛ సాథీ విషయమై ఫోన్ చేసిన సందర్భంలో నువ్వు ఎవరు, నన్ను ఎందుకు అడుగుతున్నావని అసభ్యంగా ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. ఈ స్పందనని సోషల్ మీడియాలో తన వ్యాఖ్యని ప్రసారం చేసినట్లు తెలిపారు.

విచారకర సంఘటన: బిజయ్ కుమార్ పట్నాయక్

37 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఇలాంటి విచారకర సంఘటనని చవి చూడలేదని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. బీఎంసీ అదనపు కమిషనర్‌పై జరిగిన దారుణమైన దాడిని చాలా భయంకరమైన సంఘటనగా అభివర్ణించారు.

భారీ వర్షాలకు అతలాకుతలం



రామగిరిలో ఆటోలపై కూలిన వృక్షం



కొరాపుట్ బంగ్లాగుడలో ప్రమాదకర స్థితిలో పయనిస్తున్న వాహనాలు



నబరంగ్‌పూర్ తారాగాం వద్ద జాతీయ రహదారి పై కూలిన వృక్షం



జయపూర్ పారాబెడ వద్ద రోడ్డు పై నిలిచిన నీరు

కొరాపుట్: భారీ వర్షాలకు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం మంగళవారం మరింత జోరు పెంచింది. కొరాపుట్ జిల్లా రామగిరి వద్ద సంతలో భారీ వృక్షం నేల కూలింది.ఈ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పింది. ఈ ఘటనలో రెండు వాహనాలు శిథిలమయ్యాయి. నబరంగ్‌పూర్ జిల్లా తారాగాం వద్ద జాతీయ రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. జయపూర్ పట్టణంలో పారాబెడాలో వీధుల్లో నీరు నిలిచిపోయింది. కొరాపుట్ జిల్లా బంగ్లాగుడ వద్ద వంతెన పై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి జబాబల్ వద్ద రోడ్డు పై నీరు ప్రవహిస్తుండంతో వాహనాలు మళ్లించారు.

ప్రమాదకరంగా సువర్ణరేఖ ప్రవాహం

- పాఠశాలలకు సెలవు



బుధాబలంగ్ నది ఉద్ధృతి



భోగొరాయి మండలంలో రహదారులపై వరద నీరు ప్రవాహం



ఉప్పొంగుతున్న సువర్ణ రేఖ నది



జల దిగ్బంధంలో గ్రామాలు

భువనేశ్వర్: సువర్ణ రేఖ వరదతో ఉప్పొంగుతుంది. రాజ్‌ఘాట్ వద్ద ప్రమాద సంకేతం దాటి నది నీటి మట్టం పెరిగింది. మంగళ వారం ఉదయం 7 గంటలు సరికి 10.83 మీటర్ల నీటి మట్టంతో సువర్ణ రేఖ పొంగి పొర్లుతోంది. భోగొరాయి మండలంలో 15 పంచాయతీలలోని 30 గ్రామాలు నీట మునిగిపోయాయి.

శాంతిస్తున్న జలకా నది

ప్రమాద సంకేతం దిగువన జలకా నది నీరు ప్రవహిస్తోంది. బొస్తా మండలం మథాని తీరంలో ప్రమాద సంకేతం దిగువ నీటి మట్టంతో ప్రవహిస్తోంది. బొస్తా మండలంలో 10 గ్రామాలు వరద నీట మునిగాయి.

పాఠశాలలకు సెలవు

బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో వరద ముప్పు పొంచి ఉంది. ఈ జిల్లాల్లో మూడు ప్రధాన నదులు సువర్ణ రేఖ, బుఢాబలంగ్, జలకాలో వరద నీరు ఉప్పొంగుతోంది. బుఢాబలంగ్ నదిలో వరద ఉద్ధృతంగా ఉంది. ప్రస్తుతం ఈ నది నీటి మట్టం 7.20 మీటర్ల ఎత్తులో కొనసాగుతుంది. వరద ముప్పు దృష్ట్యా రెండు జిల్లాల జిల్లా కలెక్టర్లకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తరలింపుతో పాటు సహాయక చర్యలను పర్యవేక్షించాలని జల వనరుల శాఖ ఆదేశించింది. మయూర్‌భంజ్ జిల్లాలో మెరుపులు, ఉరుములతో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కొనసాగుతున్నాయి. దీని ప్రభావం పెరుగుతుందని వాతావరణ శాఖ తెలియజేసింది. దీని దృష్ట్యా మయూర్‌భంజ్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు 3 రోజుల పాటు మూసివేయాలని జిల్లా కలెక్టర్ హేమకాంత్ సాయి ఆదేశించారు.

విమానాశ్రయంలో మాక్ డ్రిల్



మంటల వ్యాప్తి నివారణ కసరత్తు



విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం దృశ్యం



ఆపత్కాల పరిస్థితుల్లో అగ్నిమాపక వ్యవస్థ



హుటాహుటిన బాధితుల తరలింపు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఆపత్కాల పరిస్థితుల్ని సమర్థంగా ఎదుర్కోవడంలో విమానాశ్రయం యంత్రాంగం సన్నద్ధతను అంచనా వేసేందుకు ఈ కసరత్తు నిర్వహించారు. ఆకస్మిక విపత్తు నిర్వహణలో ప్రతిస్పందన బృందాల మధ్య సమన్వయం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఇలాంటి కసరత్తులు భద్రతా చర్యలను బలోపేతం చేస్తాయి. సిబ్బందిలో ఆత్మ విశ్వాసాన్ని దృఢపరచి సంభావ్య సంక్షోభాలకు వేగవంతమైన, ప్రభావవంతమైన ప్రతిస్పందనను నిర్ధారిస్తాయని నిర్వాహక వర్గం తెలిపింది.

హోరెత్తుతున్న నిరసనలు



బీఎంసీ పారిశుధ్య కార్యకర్తల విధుల బహిష్కరణ



కటక్‌లో అధికారుల విధుల బహిష్కరణ ప్రదర్శన

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ అదనపు కమిషనర్‌పై అమానుష దాడి పట్ల సిబ్బంది తీవ్ర నిరసనం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యని వ్యతిరేకిస్తూ మంగళ వారం బీఎంసీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. బీఎంసీ పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకి నడుం బిగించారు.

బొలంగీర్‌లో ఓఏఎస్ రాతకోతలు విరమణ

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన ఓఏఎస్ అధికారిపై దాడికి నిరసనగా బొలంగీర్ జిల్లాలో ఓఏఎస్ అధికారులు రాతకోత కార్యకలాపాలు విరమించి శాంతియుతంగా నిరసన ప్రదర్శిస్తున్నారు. బొలంగీర్ సర్క్యూట్ హౌస్‌లో ఈ అధికారులు అంతా సమావేశమై తదుపరి కార్యాచరణ కోసం వ్యూహాత్మక కార్యాచరణ రూపొందిస్తున్నారు. కటక్ నగరంలో పరిస్థితి మరింత వాడివేడిగా కొనసాగుతుంది. ఈ ప్రాంతంలో ఓఏఎస్, ఓఆర్ఎస్ అధికారులు సామూహిక సెలవు ఆందోళనకు దిగారు. నిందితుల్ని కఠినంగా శిక్షించేంత వరకు సెలవులో ఉంటామని హెచ్చరించారు. కటక్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శివ్ టొప్పో ఈ మేరకు సమాచారం ఇచ్చారు.

క్లుప్తంగా


ఓఏఎస్ అధికారులు మూకుమ్మడి సెలవు



కొరాపుట్‌లో సమావేశమైన ఓఏఎస్ అధికారులు


కొరాపుట్: కొరాపుట్ జిల్లాలోని ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులు మూకుమ్మడి సెలవుకు దిగారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సద్భవనా సగృహంలో మంగళవారం జిల్లా స్థాయి ఓఏఎస్ అధికారులు సమావేశమయ్యారు. తమ సహచర అధికారి రత్నకర్‌పై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని సంఘం ఆక్షేపించింది.అనంతరం ఏడీఎం దేవిప్రసాద్ మాట్లాడుతూ.. దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యాలయాలకు వెళ్తామని.. అయితే ఎలాంటి పనులు చేయమని ప్రకటించారు. మంగళవారం రాత్రి మరో ఏడీఎం తపన్ నాయక్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. కొరాపుట్ జిల్లాలో కూడా ఓఏఎస్ అధికారులు మూకుమ్మడి సెలవు పెట్టాలని నిర్ణయం చేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో జయపూర్‌లోని విక్రం దేవ్ యునివర్సిటీ రిజిస్ట్రార్ మహేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా దాశరథి గోమాంగో



పర్లాకిమిడి: గజపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మోహానా ఎమ్మెల్యే దాశరథి గోమాంగోను నియమితులయ్యారు. మోహానా ఎమ్మెల్యేగా దాశరథి గోమాంగో రెండు సార్లు విజయం సాధించారు. డీసీసీ అధ్యక్షులుగా గోమాంగో మూడోసారి నియమితులయ్యారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని విలేకరులతో అన్నారు. ఈ సందర్భంగా గజపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సూర్యనారాయణ పాత్రో, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జాస్మిన్ షేక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బసంత పండా, కున్నా మరిఖ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వనమహోత్సవం



మొక్కలను నాటుతున్న డీఈఓ మాయాధర్ సాహు

పర్లాకిమిడి: 76వ వనమహోత్సవం సందర్భంగా జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, జిల్లా శిక్షాధికారులు కలిసి బెత్తగుడ డీఈవో కార్యాలయం వద్ద మంగళవారం డీఈవో డాక్టర్ మాయాధర్ సాహు పర్యవేక్షణలో మొక్కలను నాటారు. గజపతి జిల్లాలో అన్ని మండలాల్లో ప్రత్యేక పాఠశాలల్లో మన అమ్మపేరిట ఒక మొక్కను విద్యార్థులు నాటాలని డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎ.రవికుమార్, జిల్లా పీఈటీల ఇన్‌చార్జి సురేంద్ర కుమార్ పాత్రో పాల్గొన్నారు.

విరిగిపడిన కొండచరియలు



రోడ్డుపై ఉన్న రాళ్లను తొలగిస్తున్న గిరిజనుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బోండఘట్టీ రహదారిలో మంగళవారం కొండచరియలు విరిగిపోయి ప్రధాన రహదారి పైకి వచ్చాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. మల్కన్‌గిరిలోని ఖోయిర్‌పూట్ సమితి బోండఘట్టీ సముద్ర మట్టానికి నాలుగు వేల అడుగుల ఎత్తులో ఉంది. ఈ రహదారిలోని ఘాటీపై ఆంద్రాహల్, కదంగూఢ, వరకు రహదారిపై చెట్లు, రాళ్లు పడి రాకపోలకు అంతారాయం కలిగింది. అధికారులు స్పందించి రాళ్లను తొలించాలని ప్రజలు కోరుతున్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: పట్టణంలో 13 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని ఎరుకుల వీధిలో ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 13మంది పేకాటరాయుళ్లను పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.23,800, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యువతి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని రామవరం మధుర గ్రామం కరకవలస గ్రామానికి చెందిన చుక్క సత్యవేణి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బయట నుంచి వచ్చిన యువతి తండ్రి ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని తమ కుమార్తె వేలాడుతోంది. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. కడుపునొప్పి తాళ లేక తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తండ్రి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొంతమందికే ప్రోత్సాహకం..!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణులకు జేఎస్‌వై లబ్ధి
- ఏప్రిల్ నుంచి జూన్ 26వరకు 1842 మంది ఆన్‌లైన్‌లో నమోదు
- 1232 మందికి మాత్రమే నగదు జమ
- ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిన కూటమి సర్కారు



ఘోషా ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలు

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు సంక్షేమానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది, కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలను ప్రోత్సహించడం కోసం అందించే జేఎస్‌వై ప్రోత్సాహకాలు అందించడంలో కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రోత్సాహకాలు అందరికీ కాకుండా కొంతమందికి ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 వేలు ఆరోగ్య ఆసరా కింద ఇచ్చేది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసవాలు జరిగే ఆస్పత్రులు జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి ఏరియా ఆస్పత్రులు, బాడంగి, నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి సీహెచ్‌సీలు, ఘోషాఆస్పత్రిలో ప్రసవాలు జరుగుతాయి. అదేవిధంగా జిల్లాలో ఉన్న 48 పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు జరుగుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే బాలింతలకు జననీ సురక్ష యోజన కింద ప్రోత్సాహకం (జేఎస్‌వై) అందజేస్తారు. గ్రామీణ ప్రాంత తల్లులకు రూ.1000, పట్టణ ప్రాంత తల్లులకు రూ.600 ఇస్తారు.

1842మంది తల్లుల నమోదు

ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ 26వతేదీ నాటికి ఎంఎస్ఎస్ పోర్టల్‌లో 1842 తల్లులు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో 1232 మందికి మత్రమే నగదు జమ అయింది. 610 మందికి జేఎస్‌వై ప్రోత్సాహకం అందాల్సి ఉంది.

మిగిలిన వారికి త్వరలో అందజేత

జేఎస్‌వై కింద గ్రామీణ ప్రాంత మహిళలకు రూ.1000, పట్టణ ప్రాంత మహిళలకు రూ.600 చొప్పున ప్రోత్సాహకం అందించనున్నాం. ఈ ఏడాది ఇంతవరకు 1842 మందికి గాను 1232 మందికి ప్రోత్సాహకం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగతా 610 మందికి కూడా త్వరలో వారి ఖాతాల్లో జమ అవుతుంది.

డాక్టర్ ఎస్. జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

5న కేంద్ర మంత్రి ధర్మేంద్ర రాక



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్, సబ్ కలెక్టర్ సస్య రెడ్డి

కొరాపుట్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొరాపుట్ జిల్లాకు ఈ నెల ఐదో తేదీన రానున్నారు. ఈ సమాచారం జిల్లా అధికారులకు మంగళవారం చేరింది. కొరాపుట్‌లోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేస్తారు. అందుకు తగ్గ ఏర్పట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. మరో వైపు గతంలో ధర్మేంద్ర ప్రధాన్ జయపూర్ వచ్చినప్పుడు స్థానిక ప్రజలు తమ పట్టణంలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను మరోసారి వచ్చినప్పుడు ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించనున్నారు. శాశ్వత భవన నిర్మాణం కోసం జగన్నాథ్ సాగర్ సమీపంలో పంచానన మందిరం వద్ద ఎనిమిది ఎకరాల ప్రభుత్వం స్థలాన్ని అధికారులు సిద్ధం చేశారు. పర్యటనలో భాగంగా ధర్మేంద్ర జయపూర్‌లో కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్యరెడ్డిలు జయపూర్‌లో పర్యటించారు. తొలుగ తాత్కాలికంగా నడుస్తున్న కేంఫదీయ విద్యాలయానికి వెళ్లి ప్రిన్సిపాల్ హరిహర పండాతో మాట్లాడుతారు. కేంద్రీయ విద్యాలయం కోసం సిద్ధం చేసిన స్థలాన్న పరిశీలిచారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ చిత్త రంజన్ పట్నాయక్, ఇంజినీర్ అజయ్ జానీ ఉన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు గిరిజనుల వినతి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: తాగునీరు, భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కారిగూడ పంచాయతీ దొంద మానుగూడ గ్రామ గిరిజనులు పలువురు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావును కలిసి వినతపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న ఛైర్మన్ ఇంటికి వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు. మంచినీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలపై ఛైర్మన్‌తో చర్చించారు. పైనాపిల్, కొండచీపుళ్లు, చిరుధాన్యాలు వంటి పంటలకు గిట్టుబాబు ధర లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఛైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఛైర్మన్‌ను కలిసిన వారిలో సవర సింహాచలం, హడ్డుబంగి శేషమ్మ ఉన్నారు.

120 సారా ప్యాకెట్ల పట్టివేత

సాలూరు: పట్టణంలో 120 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎస్సై అప్పలరాజు, సిబ్బందితో కలిసి ఎరుకుల వీధిలో ఓ పాత నిందితురాలి నుంచి 120 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా సారా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ సీఐ నంబరు 9440902374కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.సారా నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్టు

భామిని: మండలంలోని కోసిమానుగూడ సమీపంలో సారా అమ్ముతున్న బిడ్డిక రామారావు అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై జి.అప్పారావు తెలిపారు. 20లీటర్ల సారా సీజ్ చేసి నిందితుడిని కొత్తూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

20 మద్యం సీసాల పట్టివేత

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మద్యం బెల్ట్‌దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఎస్సై బి.రాముడు ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించగా మద్యం బాటిల్స్‌తో ఓ వ్యక్తి కనిపించడంతో అదుపులోకి తీసుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మోకాళ్లపై ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

- కమిషనర్‌కు సమ్మె నోటీసు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం రూ. 24,500, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలను ప్రతినెలా 10వ తేదీ లోపు చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా నేటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇప్పటికే అనేక మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం అనే పదాన్ని తొలగించి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించి దశలవారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 17 రోజుల సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, రిటైర్ అయిన, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ బెనిఫిట్, తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాల వర్తింపు తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రజారోగ్య అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్. రామనాయుడు, రాజు, ధనుంజయ, ప్రసాద్, బుజ్జి, నాయుడు, రామచంద్రరావు కుమారి, శంకరరావు, రమ, సూరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 5న శనివారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలో గల రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబులు హాజరవుతారని తెలియజేశారు. పార్లమెంట్ పరిశీలకులు, ఎంపీ, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్యనాయకులు హాజరు కానున్నారన్నారు.

అందరూ హాజరుకావాలి

ఈ సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో గల మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో గల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ సభ్యులు, మాజీ డీసీసీబీ, మాజీ డీసీఎంఎస్ సభ్యులు, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు అందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, బంకురు రవికుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తప్పెట ప్రసాద్, అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, ఎంపీటీసీలు బడే రామారావు, వై.రమణ, సర్పంచ్‌లు తీళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దీనకుమార్‌కు సత్కారం



డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను సన్మానిస్తున్న పశువైద్య సహాయకులు

సీతానగరం: పార్వతీపురం బదిలీ అయిన పశుసంవర్థక ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను పశువైద్య సహాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. దీర్ఘకాలంగా మండల పశువైద్యాధికారి, సీతానగరం పశువైద్య శాఖసబ్ డివిజినల్ ఎ.డిగా డాక్టర్ దీనకుమార్ సేవలందించిచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు కావడంతో పార్వతీపురం సబ్‌డివిజన్ ఎ.డి గా బదిలీ అయినందున పశువైద్య సహాయకులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సన్మాన గ్రహీత డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు అనివార్యమే అయినా విధుల్లో అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయన్నారు. సుదీర్ఘకాలం మండలంలో పశువులకు సేవలందించే సదవకాశం తనకు దక్కిందన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉద్యోగులు. ,శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కళ్లకు గంతలతో నిరసన

- జిందాల్ మోసం చేసిందని నిర్వాసితుల ఆందోళన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు


శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ కళ్లు మూసి జెల్ల కొట్టిందని, తడి గుడ్డతో రైతుల గొంతు కోసిందని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రఘురాజు నివాసం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో రోడ్డుమీద కళ్లకు గంతలు కట్టుకుని జిందాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిందాల్‌తో చేతులు కలిపి అన్ని పార్టీల నాయకులు, జిల్లా అధికారులు తమను కళ్లు మూసి జెల్ల కొట్టారని, జిందాల్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నారని, వాపోయారు. జిల్లా పెద్దదిక్కు అయిన కలెక్టర్ తన ఉద్యోగం మరిచిపోయి జిందాల్ ప్రతినిధిలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని, నాడు నమ్మించి ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారని, ఇప్పటికీ ముఖం చూపడం లేదన్నారు. నాడు జిందాల్ ఇచ్చిన హామీలు ఎవరు తీరుస్తారు? ఎలా తీరుస్తారని అడిగితే చెప్పకుండా ముఖం చాటేయడం న్యాయమా? జీవనోపాధి అయిన భూములు కోల్పోయి న్యాయం అడిగితే మమ్మల్ని పోలీసుల్ని పెట్టి బెదిరిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్సీ లేఖ

జిందాల్ భూసమస్య చుట్టూ తతెత్తుతున్న పరిస్థితి అర్థం చేసుకోవాలని, తొలుత నిర్వాసితుల శాంతియుత నిరసనకు అనుమతించి తర్వాత వారిని అనుమతించక పోవడం వల్ల నిర్వాసితులు తన ఇంటికి వస్తున్నారని, స్థానికుడిని కావడం వల్ల వారిని కాదనలేక విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వారి అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడానికి అనుమతించి, తనపై ఒత్తిడి తగ్గించాలని ఎమ్మెల్సీ రఘురాజు కలెక్టర్, ఎస్పీలకు లేఖలు ఇచ్చారు.

సోషల్ మీడియా వరమా? శాపమా?

- యువతపై అత్యధిక ప్రభావం



సోషల్ మీడియాలో మునిగి తేలుతున్న నేటితరం ప్రజలు

విజయనగరం గంటస్తంభం: సోషల్ మీడియా ఇప్పుడు మనిషి నిత్యకృత్యాల్లో ఓ భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. అనుభావాలను, అలవాట్లను, ఆలోచనలను పంచుకునే చోటు. ఇది కొంతమేర బాగానే ఉన్నా ఎదుటి వారి 'సోషల్ బతుకు'లను చూస్తూ కుంగుబాటుకు లోనవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇతరుల వివరాలు, వినోదాలు, విలాసాలను చూస్తూ.. చాలామంది.తమను తాము తక్కువ చేసుకుంటున్నారు. మరి సోషల్ మీడియాలో మనం చూసే ప్రతీదీ నిజమేనా? అంటే..'కాదు' అనే చెప్పాల్సి వస్తుంది. ఎందుకుంటే 'ఫ్యామిలీ ఓవర్ ఎవ్రీథింగ్' అంటూ ఫొటోను స్టేటస్ పెట్టుకునేవారు పట్టుమని పది నిమిషాలు కూడా ఫ్యామిలీతో గడపకపోవచ్చు. 'ఫ్రెండ్స్ ఫర్ లైఫ్' అనేవారు అసలు స్నేహితులే లేకపోవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటూ అర్ధరాత్రి పూట పోస్టులు పెడుతుండవచ్చు, నిద్రపోకుండా ఆరోగ్యం పాడుచేసుకోవచ్చు. 'అమ్మే దైవం' అని ఎమోషనల్ క్యాప్షన్స్ పెట్టేవారంతా అమ్మకు పనుల్లో సాయం చేస్తారన్నది అపోహే. పొద్దున నిద్ర లేదగానే దేవుడి వీడియోలను స్టేటస్‌లుగా పెట్టుకున్నవారు మంచి మనుషులని ఏ తప్పూ చేయని వారని అనుకుంటే పొరపాటే. పిల్లికి బిచ్చం వేయనివారే 'సొంత లాభం కొంత మానుకుని పొరుగువానికి తోడుపడవోయ్' అంటూ ఫోజులు కొట్టవచ్చు. నువ్వు లేనిదే నేను లేనంటూ ఇన్ బాక్స్‌ల్లో ప్రేమ పాఠాలు వల్లె వేసేవారు..ఆ మాటే మరొకరికి చెప్పరని గ్యారంటీ లేదు. ఖరీదైన కారు ముందో, విలాసవంతమైన భవనం ముందో నిలబడి ఫొటోలు పెడితే వాళ్ల వైభోగాన్ని చూసి అసూయ కలుగుతుంది. కానీ అవి వాళ్ల సొంతమేనా కాదా? వారికి ఆ తాహతుందా, లేక ఆర్భాటాలకు పోయి అనక అప్పులతో ఇబ్బందులు పడుతున్నారా? అవేవీ మనకు తెలియదు. ఫొటోల కోసం ఎవరికో ఏదో సాయం చేస్తున్నట్లు నటించేవారు పెరుగుతున్నారని వారి సోషల్ మీడియా పోస్టులే చెబుతుంటాయి. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో అందమైన అమ్మాయిలు ఫొటోలు చూసి ఆత్మన్యూనతకు లోనయ్యేవారు, తామూ అలాగే కనపడాలని రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్ కొంటున్న వారూ లేకపోలేదు. ఫొటోలకు ఫిల్టర్లు ఉంటాయని ఎలాంటి వారైనా అందంగా కనిపించవచ్చని ఆ క్షణం స్ఫురించదు. తెరమీద కనిపించేవన్నీ ఫిల్టరేసిన బతుకులు. నిజజీవితాలు కాదు. నిజాయతీగా ఉన్నదున్నట్లు చూపించుకునేవారూ ఉంటారు. కాకపోతే వారిది ప్రదర్శనలా ఉండదు. ఎవరికీ ఇబ్బంది కలిగించదు. లేనిది ఉన్నట్లూ ఉన్నది లేనట్లూ చూపించుకోవడానికి సోషల్ మీడియాను మయసభలా వాడుకునేవారితోనే సమస్యంతా.



సెల్ఫీ జోష్‌లో..యువత డేంజర్ చిత్రం

మంచికి వాడుకుందాం..

పోస్టులు పెడుతుంటారు, సమాచారాన్ని షేర్ చేస్తుంటారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజకీయ, విధానాపరమైన పోస్టులే ఎక్కువగా దర్శనమిస్తుంటాయి.ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాలు, న్యాయపరమైన విధానాలపై వచ్చే పోస్టులను ఇతరులకు పంపడం ద్వారా చిక్కుల్లో పడుతుంటాం. అనవసరంగా పోలీసు కేసుల బారిన పడుతుంటాం.అటువంటి సమయంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సాక్ష్యాలుగా చూపుతున్నారు పోలీసులు. లేనిపోని లింకులు క్లిక్ చేయడం , పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులకు దూరంగా ఉండడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అడిక్షన్ ఉందో లేదో ఇలా గుర్తించొచ్చు...

సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల ఉద్యోగం, చదువు, పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే ఏదైనా నిర్దిష్ట సమయంలో చేయాల్సిన పనికి బదులు ఫోన్‌లో యాప్‌లను తెరిస్తే అది వ్యసనానికి సంకేతంగా చెబుతున్నారు.

- స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి ఉన్నప్పుడు, భోజనం చేసేటప్పుడు స్మార్ట్ ఫోన్‌ను తీసుకోవడం, మెస్సేజ్‌లను చూడడం.
- ప్రతి చిన్న సమస్యకు పరిష్కారంగా ఆన్‌లైన్, సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడడం.

సెల్ఫీల మోజు బాగా పెరిగింది..

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడానికి వినియోగించుకోవాలి. అతిగా సెల్‌ఫోన్ వినియోగంచడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది. ఇక యువతకు సెల్ఫీ మోజు బాగా పెరిగింది. సెల్ఫీ మోజులో ఎక్కడపడితే అక్కడ ఫొటోలు దిగుతున్నారు. దీంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

వై.సతీష్ కుమార్,
సీనియర్ కెమిస్ట్రీ లెక్చరర్, విజయనగరం

తల్లిదండ్రులు నియంత్రించాలి..

అనవసరమైన వయస్సులో పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదు. యువత ఫోన్లను విపరీతంగా వాడుతోంది. సరదా కోసం తీస్తున్న సెల్ఫీలు చివరకు ప్రాణాల మీదికి తెస్తున్నాయి.

- ప్రశాంత్ కుమార్ ఎంఎస్సీ సైకాలజీ, విజయనగరం

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.